క్లుప్తంగా

అబాకస్‌తో జ్ఞాపకశక్తి పెంపు



భవానీపురం(విజయవాడపశ్చిమ): అబాకస్ పోటీలతో జ్ఞాపకశక్తి పెంపొందుతుందని సిప్ అబాకస్ భవానీపురం హెడ్ మధుసూదనరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదివారం కంకిపాడులో నిర్వహించిన పోటీల్లో భవానీపురం, వన్‌టౌన్ బ్రాంచిల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొనగా 168 మంది వివిధ కేటగిరీలలో విజయం సాధించి బహుమతులు అందుకున్నారని చెప్పారు. ఈ పోటీల్లో తమ బ్రాంచ్‌ల విద్యార్థులు ఏపీలో రెండో సారి అత్యధిక విజేతలతో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే మెదడుకు వ్యాయామం అవసరమని, సిప్ అకాడమి అదే లక్ష్యంతో పని చేస్తుందన్నారు.

ఓఆర్‌ఎస్‌పై అవగాహన



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఓఆర్‌ఎస్ దినోత్సవం పురస్కరించుకుని విజయవాడ డివిజనల్ రైల్వే హాస్పటల్‌లోని న్యూ ఓపీడీ భవనంలో ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి సీఎంఎస్ డాక్టర్ గౌరిబాల పిల్లల సంరక్షణలో ఓఆర్‌ఎస్ వినియోగంపై మార్గదర్శకాలను వివరించారు. ముఖ్యంగా పిల్లల్లో డయేరియా, డీహైడ్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాన్ని తెలిపారు. ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్ డయేరియా, అతిసారం తదితర సంబంధిత పరిస్థితులు, చికిత్స విధానం, ఓఆర్‌ఎస్ తయారీ, వినియోగం తదితర విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం మహిళలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు భోజన వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం కామకోటినగర్‌లోని శ్రీమాలెంపాటి భాస్కరరావు మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు ఆర్యవైశ్యనాయకులు జూలూరు నాగభూషణం ఆధ్వర్యంలో భోజన వితరణ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా జూలూరు నాగభూషణం, అయ్యప్ప చేయూతతో సోమవారం మధ్యాహ్న విద్యార్థులకు భోజనం అందజేశారు. కార్యక్రమంలో విద్యా శాఖ ఎంఈఓ–2 సోమశేఖర్ నాయక్, ఏఎంఓ అశోక్, ఎస్‌ఎస్‌ఏ సెక్టోరియల్ ఆఫీసర్స్ సుధాకర్, కాంతి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలి: వైవీబీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను రద్దు చేయాలని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వై.వి.బి.రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో 27, 28 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను సోమవారం ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్, చైర్మన్, మేయర్ ఒక నెల గౌరవ వేతనాన్ని అమరావతి అభివృద్ధికి విరాళంగా ఇవ్వాలని తీర్మానించారన్నారు. వారి గౌరవ వేతనాన్ని ప్రతి నెలా వారి బ్యాంక్ ఖాతాలో వేయాలని, గతంలో మాదిరే గ్రామాల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు కేంద్ర ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, స్థానిక సంస్థల ప్రజాప్రతి నిధులకు సంవత్సరంలో ఒక రోజు తిరుమల దర్శనానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానించామన్నారు. 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందజేసి పరిష్కరించాలని కోరాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.గంగాధరరావు పర్యవేక్షించారు.

ప్రయాణం.. ప్రమాదం

- గతుకులమయంగా సీవీఆర్ ఫ్లైఓవర్
- పైకి కనిపిస్తున్న ఇనుపచువ్వలు



సీవీఆర్ ఫ్లైఓవర్‌పై గోతులు



బయటకు కనిపిస్తున్న ఇనుపచువ్వలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఫ్లైఓవర్‌పై ప్రయాణం.. ప్రమాదకరంగా మారింది. చనమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్.. నగర వాసులతో పాటు చుట్టుపక్కల ఉన్న సుమారు 20 గ్రామాల ప్రజలకు పరిచయం అవసరం లేని పేరు. విజయవాడలోని ఫ్లై ఓవర్లలో రెండో స్థానంలో ఉన్న సీవీఆర్ ఫ్లైఓవర్‌పై ప్రయాణమంటేనే వాహన చోదకులు హడలిపోతున్నారు. రూరల్ ప్రాంతాల ప్రజలు త్వరగా నగరానికి చేరుకునేందుకు 2011లో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగింది. దీని నిర్మాణ సమయంలో రోజుకు పది వేల వాహనాలు రాకపోకలు సాగిస్తాయని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇప్పుడు ఉన్న ట్రాఫిక్, గ్రామాలు అభివృద్ధి చెందడంతో వాహనాల రాకపోకల సంఖ్య దాదాపు మూడింతలు పెరిగింది. కొంత కాలంగా ఫ్లై ఓవర్‌పై గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి సీవీఆర్ పైవంతెనకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేలు.. అయినా ఫలితం సున్నా..

సీవీఆర్ ఫ్లై ఓవర్ ముగ్గురు ఎమ్మెల్యేల పరిధిలో ఉంది. దీనికి మూడు వైపులా మార్గాలు ఉండగా, ఒకటి 'పశ్చిమ' నుంచి రైల్వే యార్డులో నుంచి వచ్చే మార్గం.. గొల్లపూడి పంచాయతీ నుంచి సీఎన్‌జీ గ్యాస్ బంక్ వైపున 'సెంట్రల్' పరిధిలో ఉంది. పశ్చిమ ఎమ్మెల్యేగా సుజనా చౌదరి, సెంట్రల్‌లో బొండా ఉమా, గొల్లపూడి పరిధిలో ఉన్న మైలవరం నియోజక వర్గం వసంత కృష్ణప్రసాద్ ఉన్నారు. ఈ ముగ్గురూ మూడు నియోజక వర్గాల సరిహద్దులో ఉన్న సీవీఆర్ ఫ్లైఓవర్‌పై ఎవరికీ వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు కూటమి వారే. ఇప్పటికేనా వీరిలో ఒక్కరైనా సీవీఆర్ ఫ్లై ఓవర్ మరమ్మతులపై దృష్టి సారించాలని మూడు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలే.. వాహనాలు గుల్లే..!

విజయవాడ నుంచి కొత్తూరు తాడేపల్లి, వెలగలేరు, షాబాద, అంబాపురం, నైనవరం, జక్కంపూడి, వేమవరం, కందులపాడు అడ్డరోడ్డు మొదలు మైలవరం వైపు వెళ్లే వారు ఈ పైవంతెన మీదుగా ప్రయాణించాలి. జక్కంపూడి కాలనీలోని వేలాది కుటుంబాలు ఉపాధి కోసం ఈ ఫ్లై ఓవర్ మీద నుంచే నగరానికి చేరుకుంటారు. ఇక సెంట్రల్‌లోకి ఫ్లై ఓవర్, ఇన్నర్‌రోడ్డు మీదగా పైపుల రోడ్డు జంక్షన్‌కు చేరుకుంటారు.

నిత్యం సుమారు 40 నుంచి 50 వేల మంది ప్రయాణించే ఈ ఫ్లై ఓవర్‌కు సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుందంటున్నారు. రాత్రి వేళల్లో ఫ్లైఓవర్‌పై ఉన్న గోతులను తప్పించేటప్పుడు వెనుక వచ్చే వాహనాల కింద పడి రోజూ ప్రయాణికులు తీవ్రగాయాల పాలైన సందర్భాలతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. గోతుల కారణంగా వాహనాల జీవిత కాలం తగ్గిపోవడంతో పాటు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వైఎస్సార్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయటపడుతున్న ఇనుప చువ్వలు

ఫ్లై ఓవర్‌పై ఉన్న గోతుల నుంచి ఇనుప చువ్వలు బయటకు వచ్చి టైర్లు ధ్వంసమవుతున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాలు పడితే గోతుల్లో వర్షం నీరు నిలిచి ఎక్కడ ఏగొయ్యి ఉందో అర్థం కాని పరిస్థితి నెలకుంటోందంటున్నారు. ఫ్లై ఓవర్ దుస్థితిని అధికారులు గుర్తించి చర్యలు తీసుకోకుంటే మరికొన్ని ఏళ్లలో పూర్తిగా ధ్వంసమయ్యే ప్రమాదం లేకపోలేదంటున్నారు.

భారీ వాహనాలను నిషేధిస్తేనే మేలు

ఫ్లై ఓవర్ దెబ్బతినడానికి భారీ వాహనాల రాకపోకలే ప్రధాన కారణమని వైఎస్సార్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగటి వేళ కబేళా మీద నుంచి భారీ టిప్పర్లు ఫ్లై ఓవర్‌పైకి వస్తుండటమే గోతులు పడటానికి కారణమంటున్నారు. రాత్రి 10 గంటల తర్వాత సిటీలోకి లారీలు, ఇతర భారీ వాహనాలను సైతం అనుమతించడంతో అవి వైవీ రావు ఇన్నర్ రింగ్ మీదగా ఫ్లై ఓవర్‌పై కి వచ్చి నగరంలోకి ప్రవేశిస్తున్నాయంటున్నారు. పగలు కూడా ఫ్లై ఓవర్‌పై నుంచి భారీ వాహనాలతో పాటు లారీలు, ఇసుక, కంకర ట్రాక్టర్లను నిషేధించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ అపూర్వ ప్రగతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అంతరిక్ష పరిశోధనా రంగంలో భారతదేశం అపూర్వమైన ప్రగతిని సాధించిందని షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'భారత అంతరిక్ష ప్రయాణం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ భారతదేశం అంతరిక్ష పరిశోధనా రంగంలో దూసుకువెళ్లడంతో శాస్త్రీయ పురోగతికి, దేశ ఆర్థిక సామాజిక ప్రగతికి అండగా నిలిచిందన్నారు. 1969 ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రకు పునాది పడిందన్నారు. 1975లో మొదటి ఉపగ్రహం ఆర్యభట్టను పంపారన్నారు. టెలికమ్యూనికేషన్స్, బ్రాడ్‌కాస్టింగ్, పర్యావరణ, వైద్యారోగ్యం అనేక అంశాల్లో భారతీయ అంతరిక్ష పరిశోధనలు అండగా నిలుస్తున్నాయన్నారు. మానవ సహిత అంతరిక్ష యాత్ర, చంద్రయాన్ -3 వంటి పలు అంశాలపై ఆయన ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ, విభాగాధిపతి ఆర్.ఉదయ్‌కుమార్, అధ్యాపకులు ఏహెచ్‌డీ ప్రకాష్, మౌనిక, శృతి తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు డివిజన్లలో నీటి సరఫరా ఉండదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వన్‌టౌన్ ఫిష్ మార్కెట్ రిజర్వాయర్ (1500 కేఎల్)లోని అవుట్‌లెట్ పైపుకు ఇంటర్ కనెక్షన్ పనులు జరుగుతున్న కారణంగా బుధవారం సాయంత్రం నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎంజీడీ ప్లాంట్‌కు సంబంధించిన ఫిష్ మార్కెట్ రిజర్వాయర్ నుంచి సరఫరా అయ్యే ఫిష్ మార్కెట్ ఏరియా, కొత్తపేట, ఇస్లాంపేట, మహంతిపురం, కుమ్మరి వీధి, పొట్టి శ్రీరాములు కళాశాల పరిసర ప్రాంతాలలో (37,50,51,53 డివిజన్లు) మంచినీటి సరఫరా ఉండదని వివరించారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం నీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు.

సుజనాతో గొడవలు లేవు

మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరితో తనకు ఎటువంటి గొడవలు లేవని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. 'నా దందాల జోలికి రావద్దు' శీర్షికన సాక్షి మెయిన్‌లో వచ్చిన కథనంపై బుద్దా వెంకన్న స్పందించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సుజనా చౌదరి కృష్ణా జిల్లాకు ఇన్‌చార్జిగా ఉన్నప్పటి నుంచి అయనతో అనుబంధం ఉందన్నారు. తనను టీడీపీ నగర అధ్యక్షుడిని చేసింది సుజనానే అని చెప్పారు. అనేక అంశాల్లో కేశినేని నాని తనను వ్యతిరేకించినా సుజనా ప్రోత్సహించారని చెప్పారు. నా జీవితంలో నేను ఆయనతో ఎప్పుడూ గొడవ పడనని చెప్పారు.

బుద్దా దందాలపై లోకేష్ ఆరా

'నా దందాల జోలికి రావద్దు' పేరుతో వచ్చిన కథనంపై టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఆరా తీసినట్లు తెలిసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బుద్దా వెంకన్న చేస్తున్న దందాల పేరుతో పత్రికల్లో వస్తున్న కథనాలపై నగరానికి చెందిన పలువురు నాయకులు టీడీపీ అధిష్టానానికి వివరించినట్లు సమాచారం. ఈ అంశాలపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది.

నగరవాసుల ఆరోగ్యం పెంపునకు చర్యలు

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత అందంగా, సుందరంగా మార్చడానికి నగర వాసుల ఆరోగ్యాన్ని పెంచేలా గ్రీనరీని పెంపొందించాలని వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం ప్రకాశం బ్యారేజ్, ఫ్లైఓవర్, ఎంజీ రోడ్డులో క్షేత్రస్థాయిలో నగరంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీని పరిశీలించారు. నగరాన్ని మరింత అందంగా ఆహ్లాదంగా మార్చేందుకు మొక్క నాటాలని, వాల్ పెయింటింగ్‌లను వేయాలని పేర్కొన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే బ్యానర్లను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. కనకదుర్గ ఫ్లైఓవర్ వాల్ పెయింటింగ్స్ వేసేందుకు ప్రణాళికను సిద్ధం చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద ప్రజలకు పబ్లిక్ టాయిలెట్స్ ని నిర్మించుటకు ప్రణాళికను సిద్ధం చేయాలని చెప్పారు. నగరంలో, డివైడర్లపై మొక్కలని మరింత పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌కు ఆదేశాలు ఇచ్చారు.

అడిషనల్ కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ మహేష్, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, జోనల్ కమిషనర్ వన్ రమ్య కీర్తన, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 1 ఏఎస్ఎన్ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్ రాయ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 2 శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోండి



భవానీపురం(విజయవాడపశ్చిమ): మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుంటే పర్యావరణాన్ని కాపాడినవారవుతారని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం (గొల్లపూడి) అధ్యక్షుడు రొంపిచర్ల సత్యనారాయణ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యాన విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ఆవరణలోనూ పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే మొక్కలను నాటడం, వాటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పర్యావరణ కాలుష్యం, పర్యావరణ క్షీణత ఆర్థిక అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 51–ఎ(జి) ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడి ప్రాథమిక విధి అన్నారు. స్వచ్ఛమైన, సహజమైన గాలిని అందించే వృక్షాలను నరికేస్తే ఆక్సిజన్ కొనుక్కునే దుస్థితికి చేరుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రేమల్లె గోపాలం, కోశాధికారి దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తరుణ్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లయ్యచెరువు, ఎర్రచెరువుల్లో 2024–25 నుంచి 2026–27 వరకు చేపలను పట్టుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవి. రమణ సోమవారం వేలం పాటను నిర్వహించారు. పుల్లయ్య చెరువును మూడు లక్షల 24వేల రూపాయలకు ఆవల కోటయ్య వేలం పాడగా, ఎర్ర చెరువును రెండు లక్షల 26వేల రూపాయలకు వలగాని యేసుబాబు వేలం పాట పాడారు. వేలం మొత్తాన్ని చెల్లించేలా షరతులకు లోబడి నిర్వహించారు. బహిరంగ వేలంలో గ్రామస్తులు యర్కారెడ్డి నాగిరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, మాదు శివరామప్రసాద్, దేవులపల్లి సతీష్, గుంటక సుబ్బారెడ్డి, మురళీ పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారికి ఆషాఢసారె



ఇంద్రకీలాద్రిపై భక్తబృందాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి సోమవారం భక్తులు ఆషాడ సారెను సమర్పించారు. తెల్లవారుజామున అర్ధనారీశ్వరుడి రూపంలో కొలువై ఉన్న రామలింగేశ్వరుడికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది.



ఆషాఢ సారెను సమర్పిస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఆషాఢ మాసోత్సవాలు ఆగస్టు 4వ తేదీతో ముగియనున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పిస్తున్నాయి. సోమవారం ఏలూరు నుంచి డాక్టర్ రేవతి బృందంతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని శ్రీదుర్గ శివసాయి సేవా బృందానికి చెందిన 150 మంది, శ్రీభ్రమరాంబికా సేవా సమితికి చెందిన 90 మంది, శ్రీశివాలలితా మండలి బృందానికి చెందిన 70 మంది, బాపట్ల నుంచి విచ్చేసిన రూపాలక్ష్మి బృందానికి చెందిన 70 మందితో పాటు నగరానికి చెందిన పలువురు భక్తులు, భక్త బృందాలు సారెను సమర్పించాయి.

ఇంటర్ బాలికలకు పాఠ్యపుస్తకాలు అందజేత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ పాఠశాల ప్లస్‌లో ఇంటర్ బాలికలకు టెక్స్ట్‌బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ నడకుదిటి పుష్ప, హెచ్‌ఎం బి.పద్మలత బాలికలకు పుస్తకాలను అందజేశారు. వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. పిల్లలు ప్రయోజకులైతే తల్లిదండ్రుల ఆనందానికి అవధులు ఉండవన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకుని చేసుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్న దోమ.. పెద్ద అపాయం



పూర్ణానందంపేట సంజీవరావు వీధిలో ఖాళీ స్థలం



సాయిబాబా గుడి వీధిలో రెండు రోజులుగా రోడ్డుపై తొలగించని చెత్త

- ఖాళీస్థలాలు.. దోమలకు ఆవాసాలు
- విజృంభిస్తున్న దోమలు
- పెరుగుతున్న జ్వర పీడితులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): దోమ కనిపించడానికి చిన్నగా ఉన్నా.. అది కుడితే అపాయం మాత్రం పెద్దగా ఉంటోంది. వీటి విజృంభణకు ఖాళీ స్థలాలు చిరునామాగా మారాయి. పశ్చిమలోని పూర్ణానందంపేట, పెజ్జోనిపేట తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు దోమలకు కేంద్రంగా మారుతున్నాయి.

రోడ్లపై చెత్తాచెదారం

సైడు డ్రెయిన్లు, రోడ్లపై చెత్త చెదారాన్ని పడవేస్తుండటంతో వాన నీరు పారుదల లేక దోమల ఉధృతి పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. వీటిని ప్రతిరోజూ తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోక ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు.

ఆస్పత్రుల వద్ద క్యూ

ఈ ప్రాంతాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతాల్లోని ఆస్పత్రుల వద్ద క్యూలు కడుతున్న రోగులను చూస్తేనే పరిస్థితి అర్థమవుతుందని తెలుస్తోంది.

కానరాని మలేరియా సిబ్బంది

డ్రైడే–ఫ్రైడే, డెంగీ నివారణ మాసోత్సవాల పేరుతో వారం వారం ర్యాలీలు నిర్వహించడమేగానీ వీఎంసీ ఆరోగ్య సిబ్బంది దోమల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు శూన్యమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని జ్వరాలు ఉంటే చికిత్స చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మలేరియా లేదా డెంగీ వంటి జ్వరాల కేసులు బయట పడినప్పుడు హడావిడిగా బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకోవడం తప్ప ముందు జాగ్రత్త చర్యలు లేవని స్థానికులు మండి పడుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

దోమల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిలవకుండా చూడాలని, స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి స్థలాల్లో మెరక చేయడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందాలి

మైలవరం: హెచ్‌టీఎంఎల్, సీఎస్‌ఎస్, జావా స్క్రిప్ట్ వంటి ప్రాథమిక భాషలతో పాటు రియాక్ట్.జేఎస్ వంటి ఫ్రేమ్ వర్క్‌లు నేర్చుకోవాలని, ఈ కొత్త స్కిల్స్ వెబ్ డెవలప్‌మెంట్‌లో మరింత నైపుణ్యంగా మారడానికి సహాయ పడతాయని ఎల్‌బీఆర్‌సీఈ స్టూడెంట్ బ్రాంచ్ ఇన్‌చార్జి, భావరాజు సాయి శశాంక ఇన్ఫోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన వారం రోజుల శిక్షణ సోమవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ శిక్షణలో విద్యార్థులు వెబ్ డెవలప్‌మెంట్ ప్రాథమికాలు, ఆధునిక సాంకేతికతల వరకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామని వివరించారు. కార్యక్రమంలో ఐటీ విభాగాధిపతి డాక్టర్ బి. శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్స్‌గా హేమలత, సాంబశివరావు, శ్రీకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికలు తీశారు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో సోమవారం సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిచే పూడిక తీయించారు. గ్రామంలోని శివాలయం పల్లాలు, ఎస్సీ కాలనీ, కాల్వ గట్టు ప్రాంతం, కేపీ ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు పూడికతీసి, అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోని చెత్తను తొలగిస్తున్నట్లు చెప్పారు.